క్లుప్తంగా

జ్వరాలపై అవగాహన

పుంగనూరు: స్థానిక ప్యాలెస్ కాంపౌండులోని మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం జ్వరాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హోమియో వైద్యాధికారి నాగేనాయక్, క్లబ్ ప్రతినిధులు రఘునాథరెడ్డి, సురేష్, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జ్వరంతో చిన్నారి మృతి



సభాపర్వీన్ (ఫైల్)

సదుం: జ్వర తీవ్రతతో నాలుగేళ్ల చిన్నారి మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యుల కథనం ..జాంద్రపేటకు చెందిన షెహన్‌షా కుమార్తె సభా పర్వీన్ ఐదు రోజుల క్రితం జ్వరంతో బాధ పడుతుండటంతో పీలేరు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. గురువారం అర్ధరాత్రి హఠాత్తుగా చిన్నారి తీవ్ర అస్వస్థతకు గురైంది. వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. సిబ్బంది ఇంజెక్షన్ వేసి మెరుగైన వైద్యం కోసం పీలేరుకు తీసుకువెళ్లాలని సూచించారు. 108లో తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందింది. చిన్నారి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

పారిశుధ్యం మెరుగుకు కృషి



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

సదుం: పంచాయతీలో పారిశుధ్యం మెరుగుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ ఉషారాణి కోరారు. శుక్రవారం సదుంలో విద్యార్థులతో కలిసి శుక్రవారం స్వచ్ఛతా హి సేవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని, బహిరంగ మలవిసర్జన చేయరాదని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు హసీనా, రోజా, స్వచ్ఛభారత్ మండల కో–ఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు ఇద్దరి ఎంపిక



క్రీడలకు ఎంపికైన వారితో హెచ్‌ఎం శ్రీదేవి

పుంగనూరు: అండర్–17 చిత్తూరు జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు తమ స్కూలు విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారని మండలంలోని చంద్రమాకులపల్లె హెచ్‌ఎం శ్రీదేవి తెలిపారు. అన్నమయ్య జిల్లాలో జరిగిన ఫుట్‌బాల్ జట్టు ఎంపికలో తమ స్కూల్ 8వ తరగతి విద్యార్థి కె.ఆనంద్, విద్యార్థిని జి.రక్షిత జిల్లా జట్టుకు ఎంపికయ్యారని, వీరు ఈనెల 28 నుంచి 30 వరకు పల్నాడు జిల్లా వినుకొండలో జరిగే అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను ఫిజికల్ డైరెక్టర్ మురళీధర్, ఉపాధ్యాయులు వెంకట్రమణారెడ్డి, జ్యోతి, శైలజ, మంజునాథ్, శంకర్‌రెడ్డి, రఘు, సుజాత , స్కూల్ కమిటీ చైర్మన్ నారాయణ, రమణ తదితరులు అభినందించారు.

హామీలతో సరి.. కార్యాచరణ ఏది మరి..?

- కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేస్తామన్న ఎంపీ
- ఇచ్చిన హామీలపై ఇంతవరకు చలనం లేని వైనం

అధికారంలోకి వచ్చాక వందరోజుల పాలనలో చేసిన అభివృద్ధి, ప్రగతి గురించి చాటిచెప్పాలని పార్టీ శ్రేణుల్ని ఆదేశించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాస్తవంలో చేసిందేమీ లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇచ్చిన హామీలలో ఒకటి మాత్రమే నెరవేర్చారని, ఆయన బాటలోనే ఇచ్చిన హామీలను ఎంపీ, ఎమ్మెల్యే సైతం నెరవేర్చడం లేదని నిరసిస్తున్నారు.



కొండెక్కిన గంగన శిరస్సు పనులు(ఫైల్)

పలమనేరు: ఎన్నికల ప్రచారంలో భాగంగా మార్చి 27న చంద్రబాబు పలమనేరులో బహిరంగసభ నిర్వహించారు. ప్రస్తుత ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్ రావు స్థానికులకు ఇచ్చిన హామీలేమంటే..తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ ప్రాంతంలో రైతుల సౌకర్యార్థం కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేస్తామని, నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్భాటంగా ప్రకటించారు. కానీ ఇప్పటివరకూ వాటి ఊసే లేదాయె! అంతేకాకుండా ప్రజా సమస్యలను చట్టసభలో ప్రస్తావించి వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటిదాకా ఆయన పార్లమెంటులో పలమనేరుకు సంబంధించి ఒక్క మాట మాట్లాడి ఉంటే ఒట్టు!

గత ప్రభుత్వం నిలుపుదల చేసిన అన్ని పనులూ చేస్తానన్న అమరన్న

చంద్రబాబు ప్రసంగానికి ముందు జనాన్ని ఉద్దేశించి స్థానిక ఎమ్మెల్యే నాడు ఏం మాట్లాడారంటే... పట్టురైతులకు రావాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీ రూ.12 కోట్లు ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చాక దానిని విస్మరించారు. అంతేకాకుండా ఇక్కడి పట్టు రైతులు ఆందోళన సైతం చేశారు. అంతేకాకుండా కుప్పం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబుకు సైతం వినతిపత్రం ఇచ్చినా ఫలితం శూన్యం. గతంలో ఆగిన గంగన శిరస్సు ప్రాజెక్టు పనులు మొదలెడతామని ప్రకటించినా ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉన్నాయి. ఇక కైగల్ ఎత్తిపోతల ఇప్పటికీ ఉత్తి కోతలుగానే మారింది. మాజీమంత్రిగా బాబు ఉన్నప్పుడు పట్టణంలో కళాక్షేత్రం, బీసీ భవన్ అంబేడ్కర్ భవన్ల నిర్మాణాలు, వీ.కోటలో డిగ్రీ కళాశాల, స్థానిక గడ్డూరు కాలనీలో టిడ్కో గృహాల నిర్మాణంతో పాటు ఆసియా బ్యాంకు ద్వారా నియోజకవర్గంలో రోడ్లు, సీప్ ప్రాజెక్టు తదితరాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీఓలను రద్దు చేసిందని, వాటిని తమ ప్రభుత్వం రాగానే చేపడతామని హామీ ఇచ్చారు. కానీ అవేవీ ఇంతవరకు ముందుకు సాగలేదు. గత టీడీపీ ప్రభుత్వంలోనే పట్టణంలోని పెద్దచెరువు అభివృద్ధి మాట దేవుడెరుగు ఇప్పటికీ చెరువు కట్టపై కంపు పోలేదు.



గత టీడీపీ హయాంలో టిడ్కో గృహాలకు మాజీ మంత్రిగా అమరనాథ రెడ్డి గడ్డూరు వద్ద వేసిన శిలాఫలకం(ఫైల్)



గత ఎన్నికల సందర్భంగా చంద్రబాబు సాక్షిగా కూటమి అభ్యర్థులుగా హామీలను గుప్పిస్తున్న ఎంపీ ప్రసాద్‌రావు, ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి(ఫైల్)

ఘీంకరిస్తున్న ఏనుగుల సమస్య

కౌండిన్య అభయారణ్యంలో దశాబ్దాలుగా పీడిస్తున్న ఏనుగుల సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఫారెస్ట్ అధికారులతో కలిసి ఆయన కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. కర్ణాటకలో శిక్షణ పొందిన రెండు ఏనుగులను ఇక్కడికి తెప్పించి వాటితో ఇక్కడున్న ఏనుగులను నియంత్రిస్తామని ఆయన చెప్పారు. కానీ ఇప్పటివరకు శిక్షణ ఏనుగులు వచ్చిందీ లేదు. ఎప్పటిలాగే రైతుల పంటలను ఏనుగులు మాత్రం నాశనం చేస్తూనే ఉన్నాయి.

ఏం మంచి చేశారు స్వామీ?

ఇచ్చిన హామీలను ఇప్పటివరకూ నెరవేర్చకపోయినా 'ఇది మంచి ప్రభుత్వం' పేరిట ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వంద రోజుల పాలన గురించి ఏం చెబుతారనేది ఇప్పుడు చర్చకు తావిచ్చింది. ఈనెల 23వ తేదీ వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజలు హర్షిస్తారా లేక నిలదీస్తారా? అనేది వేచి చూడాల్సిందే.

హామీల 'బాబు'.. అంతా డాబు

- ఐటీ టవర్, స్కిల్ డెవలప్‌మెంట్, గుజ్జు పరిశ్రమ ఎక్కడ?

పుంగనూరు: పుంగనూరు ఎన్నికల ప్రచారాన్ని చంద్రబాబునాయుడు ఈ ఏడాది మే 7న నిర్వహించారు. గోకుల్ సర్కిల్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన హామీలు గుప్పించారు. అధికారంలోకి వస్తే.. పుంగనూరులో ఐటీ టవర్ ఏర్పాటు చేసి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు సౌకర్యాలు కల్పిస్తామని, అలాగే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి యువతకు శిక్షణ ఇస్తామని, చింతపండు కార్మికుల కోసం గుజ్జుపరిశ్రమ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అలాగే మెగా డీఎస్సీతో 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, ఏటా 4 లక్షల మందిని నియమిస్తామన్నారు. టెక్స్‌టైల్ పరిశ్రమలు నెలకొల్పుతామని, ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించి, విదేశీ విద్యను ప్రోత్సహిస్తామన్నారు. మసీదులకు ప్రతి నెలా రూ.5 వేలు ఆర్థిక సహాయం చేస్తామని, అలాగే ఇమామ్‌లు, మౌజమ్‌కు ప్రతి నెలా రూ.10 వేలు ఇస్తామని, కుప్పం నియోజకవర్గంతో సమానంగా పుంగనూరును దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తామని ఆర్భాటంగా ప్రకటించారు.

హామీలు గాలికి..దాడులతో విధ్వంసం

అధికారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు 100 రోజులైనా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి పైగా వైఎస్సార్‌సీపీ నేతలపై , సానుభూతి పరులపైన అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేయించారు. వైఎస్సార్‌సీపీ వారి ఆస్తులను ధ్వంసం చేశారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు. జగనన్న కాలనీలకు రహదారులను ట్రెంచ్‌లు కొట్టి స్తంభింప చేశారు. దీంతో అధికార పార్టీ ఆగడాలకు ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

డేంజర్.. డేంజర్..!



రోడ్డు మధ్యలో కల్వర్టు వద్ద పడిన గుంత

పలమనేరు: మున్సిపాలిటీలోని అగరబత్తి కాలనీ నుంచి గంటావూరుకు వెళ్లే రహదారిలో కల్వర్టు వద్ద పడిన గుంత మూలాన తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు మధ్యలో పెద్ద గొయ్యి ఏర్పడి, కమ్మీలు సైతం తేలి ఉండటం..ప్రధానంగా రాత్రిపూట బైక్‌లపై వెళ్లేవారు దీనిలో పడి గాయాలపాలవుతున్నారు. సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు



రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో వాలీబాల్ ఆడుతున్న బాలికలు

రొంపిచెర్ల: మానసికోల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో రెండు రోజుల మండల స్థాయి క్రీడా పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యతో పాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలని, క్రీడల వల్ల శారీరకంగా, మానసికంగా యువత దృఢంగా తయారవుతారన్నారు. మండల స్థాయిలో సత్తా చాటి నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. గానుగచింత, పెద్దమల్లెల, కేజీబీవీ, మోడల్ స్కూల్, బొమ్మయ్యగారిపల్లె, రొంపిచెర్ల బాలికలు, బాలుర, ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆటలపోటీలలో పాల్గొన్నారు. బాలికల విభాగం వాలీబాల్ పోటీలలో కేజీబీవీ పాఠశాల విద్యార్థులు సీనియర్స్, జూనియర్స్‌లో విజేతలుగా నిలిచారు. అలాగే వాలీబాల్ బాలుర విభాగంలో రొంపిచెర్ల బాలుర పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లోకనాధ రెడ్డి, పీఈటీలు పాల్గొన్నారు.



కబడ్డీ ఆడుతున్న బాలికలు

మొక్కలు నాటారు



ఉద్యానవనంలో మొక్కలు నాటుతున్న అధికారులు

పలమనేరు: స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక బాపూజీ ఉద్యానవనంలో మున్సిపల్ అధికారులు శుక్రవారం మొక్కలు నాటారు. ఆ తర్వాత పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగు పరిచారు. పరిసరాల శుభ్రతపై మున్సిపల్ కార్మికులకు స్థానిక మెప్మా సిబ్బంది అవగాహన కల్పించారు. పట్టణంలో డంప్ సైట్స్‌ను శుభ్రం చేసి వ్యర్థాలను కంపోస్ట్ యార్డుకు తరలించారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల కబడ్డీ విజేత ఇన్‌ఫాంట్ స్కూల్



గెలుపొందిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

గంగవరం: మండలంలోని కొత్తపల్లె జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించారు. అండర్–17 విభాగంలో 5 మండలాలకు చెందిన బాలికలు ఈ పోటీలకు హాజరయ్యారు. వీ.కోట మండలానికి చెందిన ఇన్‌ఫాంట్ స్కూల్ విద్యార్థినులు విన్నర్స్‌గా, కొత్తపల్లె స్కూల్ రన్నర్స్‌గా నిలిచాయి. శనివారం ఇదే పాఠశాలలో బాలుర విభాగంలో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఎంఈవోలు వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, సర్పంచ్ గిరిరాజారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

వీ.కోట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్లో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ యూనిట్ అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ, ఎయిడ్స్ రోగులను చిన్నచూపు చూడరాదన్నారు. హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాప్తి, చికిత్స, దాని బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అలాగే క్షయవ్యాధిపై కూడా అవగాహన కల్పించారు.



వీ.కోట: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్యశాఖ అధికారులు

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్ఐవీ/ఎయిడ్స్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎయిడ్స్ వైద్యాధికారి హిమవంతరెడ్డి ఆధ్వర్యంలో తెలియజేశారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రావణి, సాదిక, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సింగిల్‌విండో చైర్మన్‌కు నివాళి

- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్ సంతాపం

పుంగనూరు: సోమల మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు, సింగిల్‌విండో చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి , తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. పెద్దిరెడ్డి కుటుంబం తరఫున శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకుడు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి మృతుడి స్వగ్రామమైన ఒంగోలు జిల్లా టంగుటూరు మండలం నిడమనూరు గ్రామానికి వెళ్లారు. వెంకటేశ్వర్‌రావు భౌతిక కాయానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయన కుమారుడు బాలాజీని పరామర్శించి ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో నాగభూషణంరెడ్డి, శ్రీరాములు, ఆటోశివ, వెంకట్రావు, పాండురంగయ్య ఉన్నారు.



సోమల సింగిల్‌విండో చైర్మన్‌కు నివాళులర్పిస్తున్న పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి

పౌష్టికాహారంతో ఆరోగ్యం





బైరెడ్డిపల్లె: అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ మాధవీలత, పలమనేరులో..

బైరెడ్డిపల్లె: తాజా ఆకుకూరలు, పండ్లు, గుడ్లు వంటి పౌష్టికాహారం తీసుకోవడం వలన ఆరోగ్యవంతంగా ఉంటారని సీడీపీఓ మాధవీలత అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ఆహారంలో పల్లీలు, మినుములు, శనగలు, బాదంపప్పు వంటివి ఉండేలా చూసుకోవాలన్నారు. తీసుకునే ఆహారంలో రోజూ 100 గ్రాముల ఆకుకూర ఉండటం మంచిదన్నారు. జామ, నిమ్మ, ఉసిరి, ఉడికించిన గుడ్లు తినాలన్నారు. భోజనానికి ముందు, తర్వాత తప్పనిసరిగా చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రంగాపురంలో..

పలమనేరు: పట్టణంలోని రంగాపురం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ శాఖ పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించింది. స్థానిక ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజ్మా మాట్లాడుతూ, గర్భవతులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ నెలాఖరు వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీలు, హెల్పర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ధరాఘాతం

- కొండెక్కిన నిత్యావసర సరుకుల ధరలు
- సలసల కాగుతున్న వంట నూనెల ధర
- రెండు నెలలుగా కూరగాయల ధరలు పైపైకే
- ధరల నియంత్రణలో చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం

పలమనేరు నియోజకవర్గంలో...

మొత్తం జనాభా	: 3లక్షలకు పైగా
ప్రొవిజన్ దుకాణాలు	: 1300 దాకా
రోజువారీ నిత్యావసరాల ఖర్చు	: రూ.కోటికి పైగా
వారపు సంతలు	: 10
సూపర్‌మార్కెట్లు, మాల్స్	: 40 దాకా



పలమనేరు: వైఎస్సార్‌సీపీ పాలనలో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, ఫలితంగా సామాన్య ప్రజలు ఏమీ కొనలేని పరిస్థితి కలిగిందని, అదే తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధరలను నియంత్రిస్తామని పలు సమావేశాల్లో ఊదరగొట్టిన చంద్రబాబు ఎప్పటిలాగే హామీలు నెరవేర్చే విషయంలో చేతులెత్తేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే నిత్యావసరాల ధరలు రెట్టింపై ధరాఘాతం తాకిడికి ప్రజలు గగ్గోలు పెడుతున్నా వారి ఆక్రందనలు కూటమిని కదిలించడం లేదు.

భారీగా పెరిగిన వంట నూనెల ధరలు

ఇటీవల బడ్జెట్‌లో వంట నూనెలపై కేంద్రం దిగుమతి సుంకాన్ని 20 శాతానికి పెంచింది. దీంతో వంటనూనెల ధరల భారీగా పెరిగాయి. దీంతో 12 శాతం ఉన్న దిగుమతి పన్ను 32 శాతానికి పెరిగింది. ఫలితంగా వంటనూనెల లీటర్ ప్యాకెట్‌పై రూ.20 వరకూ పెరిగింది. మొన్నటిదాకా పామాయిల్ ధర రూ.96 కాగా ఇప్పుడు రూ.120, సన్‌ఫ్లవర్ రూ.115 నుంచి రూ.140, శనగనూనె రూ.155 నుంచి రూ.170కి చేరింది.

ధరల పెరుగుదల ఇలా..

గతంలో రూ.40గా ఉన్న ఉల్లిపాయలు కిలో రూ.70, కందిపప్పు రూ.140 నుంచి రూ.190, గోధుమ పిండి రూ.30 నుంచి రూ.50, బియ్యం రూ.50 నుంచి రూ.80, గుడ్డు రూ.4.50 పైసల నుంచి రూ.6కు చేరింది. ఇవేకాదు వంటలకు వినియోగించే అన్ని పోపులు, దినుసులు, ధనియాలు, మిరపకాయలు, ధనియాలు, చింతపండు, పసుపు తదితరాల ధరలు 30 శాతం వరకూ పెరిగాయి.ఇవే కాకుండా కూరగాయల ధరలు సైతం భారీగా పెరుగుతున్నాయి. ఈ ధరలతో కొనగలమా, తినగలమా; అనే మాట ప్రజల్లో వినిపిస్తోంది.



నిత్యావసర వస్తువులు



వంటనూనెలు


రూ.90 నుంచి రూ.150 దాటిన నూనె ధర



నేను కూలిపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నా. ఇంట్లో ఏ వంట చేయాలన్నా వంట నూనె తప్పనిసరి. ఎన్నికల ముందు లీటర్ నూనె రూ.90 దాకా ఉండింది. ఇప్పుడు క్వాలిటీ, కంపెనీలను బట్టి ధర రూ.150 దాటింది. నూనె ఒక్కటే కాదు.. అన్ని రకాల వస్తువుల ధరలు భగ్గుమంటున్నాయి. దీనికి కారణమెవరోగానీ మాలాంటి సామాన్యులకు మాత్రం అంత అన్నం, పప్పు తినడం మాత్రం ఇబ్బందిగానే మారింది.

–మునివెంకటరెడ్డి, జంబుగుండ్లపల్లె

మద్యం ధర తగ్గిస్తామని నిత్యావసరాల ధరలు పెంచాలా?



నిన్నా మొన్నో పేపర్లో చూశా ఇకపై మద్యం ధర రూ.90 కే ఇస్తారంట! ఇది మందుబాబులకు మంచివార్తే. అయితే నిత్యావసర సరుకుల ధరలను అమాంతం పెంచేయడంపై ఎవరూ మాట్లాడరు ఎందుకు? ఇంట్లో సాంబారో, పప్పో చేసుకోవాలంటే నూనె నుంచి ఎర్రగడ్డ, తెల్లగడ్డ.. ఇలా ఏది కావాలన్నా ధరలు ఆకాశాన్ని అంటుతుంటే పేదలు ఎలా చేయాలి? గతంలో ధరల పెంపునకు జగన్‌రెడ్డి కారణమన్న చంద్రబాబు ఇప్పుడు ఏమంటారో?

–గోవిందు, బేరుపల్లె